# కిటుకు

రచయితలంటే నాకో అభిప్రాయముండేది.

వాళ్ళు సీరియస్‌గా వుంటారని, ఎదుటివ్యక్తిని ఆసక్తిగా పరిశీలించి వాళ్ళమీద కథలల్లుతారని, వీలు చిక్కినప్పుడల్లా పుస్తకాల పురుగు లవుతారని....

అంబాజీరావు అలా వుండడు. ప్రవర్తించడలా. అంబాజీరావు నా స్నేహితుడు అంతేకాదు ప్రీ యూనివర్శిటీ రోజులనుంచి నా క్లాస్‌మేట్.

బి ఏ రెండవ సంవత్సరములో తన చదువు ఆపేశాడు ఆర్థికమైన కారణాలవల్ల ఎప్పుడయినా కాలేజీ మేగజైనుకంటూ కథలు వ్రాసి నాకు వినిపించినా, అంబాజీరావుని నేనెన్నడూ కథా రచయితగా పరిగణించలేదు, లేదా గుర్తించలేరు

ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ సరదాగా తిరిగే అంబాజీరావు కథా రచయిత అవుతాడని నే నెన్నడూ అనుకోలేదు. అలా అయాడని తెలిసిన రోజు నిజంగా ఆశ్చర్యపడ్డాను.

నాలా మంచి వుద్యోగం దొరక్కపోయినా, తను బ్రతకగలిగే చక్కని వుద్యోగం సంపాదించుకున్నాడు తర్వాత హైదరాబాద్‌లో నా రూమ్‌మేట్ అయాడు. పత్రికలు కొనే స్తోమతలేక, అద్దెకుతెచ్చి చదువు తూండేవాడు.

ప్రతీ ఆదివారం క్రమం తప్పకుండా ఒకటి రెండు కథలయినా వ్రాసి ఆ వ్రాతప్రతులను తోటి రచయితలకు చదివి వినిపించడానికి వుదయం పదకొండుకల్లో వంట చేసేసి, భోజనం ముగించి వెళ్ళిపోయే వాడు.

ఆ ఆదివారం నేనూ అంబాజిరావు వెంటవెళ్ళాను. చాలాసార్లు రమ్మని సరదాగా పిల్చినా ఆ ఆదివారం ఎప్పటిలా నిరాకరింపకుండా వెళ్ళాను జేబులో సినిమాకెళ్ళడానికి సరిపడ డబ్బులేక, ఎలా కాలాన్ని ఖర్చుపెట్టాలో తోచక వెళ్ళాను.

ఒక రచయిత ఇంటికి తీసుకెళ్ళి ఆయన్ని పరిచయం చేశాడు. నేటి పెద్దమనిషి బిడ్డా. ఆయనకు కథలంటే మంచి వుత్సాహం. ఇదివరలా ఇప్పుడు వ్రాయకపోయినా మంచి అనుభవస్తుడు కనుక రచయితలకి సలహాలు అవీ ఇస్తూంటాడు

"కొత్తకథ లేమయినా వ్రాసారా?" అడిగాడాయన పరిచయాలయాక అంబాజిరావుని

"లేదు సార్. కాని ఒక మంచి కథని చదివాను. స్పానిష్ కథలు ఇంగ్లీషులోకి అనువదింపబడ్డాయి ఆ కథల సంపుటిని మా ఆఫీసు లైబ్రరీ కోసం కొన్నారు కొత్తగా ఆ కథల సంపుటిలో ఒక కథ నాకు బావుంది.

ఏం కథ అది?" అడిగాడాయన.

ఆయన భార్య పిలిస్తే లోపలికి వెళ్ళి నాలుగైదు నిమిషాలలో రెండు గ్లాసులతో వచ్చాడు.

"తీసుకోండి" అన్నాడు ఆప్యాయంగా.

నిమ్మకాయనీళ్ళు

"థాంక్స్" అన్నాను.

"నిమ్మకాయ నీళ్ళకి మంచి కథ చెప్పండి" అన్నాడాయన అంబాజిరావుతో.

ఒక కథని చెప్పాడు అంబాజిరావు, నేను ప్రక్కనేవున్న సినిమా పత్రిక తిరగేస్తుంటే

"వండర్‌ఫుల్! చాలా బాగుంది" మెచ్చుకొని కొంచెం సేపాగి అన్నాడాయన మళ్ళీ

"మన తెలుగు కథ యీ స్థాయికి ఎప్పుడు ఎదుగుతుందో-ఎన్నో కథ లొస్తున్నాయి కాని అన్నీ చప్పగా ఉంటున్నాయి. ఇంకో భాషలోకి తర్జుమా చేయదగ్గవనిపించే కథలు మనకు చాలా తక్కువ.

ఒంటిగంటదాకా ఆయనింట్లోనే కూర్చుని తిరిగివచ్చాం. నేను పక్క మీద చేరాను నిద్రాదేవిని ముద్దుపెట్టుకుని కౌగిలించుకోవాలని. అంబాజి

రావు తెల్లకాగితం కింద కార్బన్ కాపీ బిగించి రచనా వ్యాసంగంలోకి జారిపోయాడు. నేను నిద్రలోకి జారకముందే.

* * *

"నువ్వొట్టి దొంగవి" అరిచాను అంబాజీరావుని. కథ స్వంతంగా రాసే శక్తిలేకపోతే వూరుకోవాలి గాని, పరభాషలలోని కథలని దొంగతనం చేస్తావా?"

"ఏమిటి?" కొద్దిగా బిత్తరపోయాడు అంబాజీరావు. "నేను కథని దొంగతనం చేస్తానా?" అన్నాడు.

"లేకపోతే" ఇది నువ్వు దొంగిలించిన కథ కాదా?" అని చేతిలోని పత్రికని అంబాజీరావు వైపు విసిరేశాను.

పుస్తకం మీద ముఖచిత్రం చూసి అందులో ప్రచురింపబడ్డ తన కథని గుర్తుతెచ్చుకున్నాడు అంబాజీరావు క్షణాలలో.

"ఇందులో ప్రింటయిన కథ చదివావా? దీనిమీదేనా నీ ఆరోపణ" అడిగాడు సందిగ్ధంగా.

"అవును "సమర్పణ" నీ స్వంత బుర్రలోంచి పుట్టివచ్చిన కథ కాదు"

"నాదే"

"అబద్ధం నిలవదోయ్. ఇది స్పేనిష్‌భాషలోంచి ఇంగ్లీషులోనికి అనువాదం చేయబడిన కథ అవునా?"

"ముమ్మాటికి కాదు. నా స్వంత రచన" అన్నాడు కొద్దిగా ఆశ్చర్యంగా.

"వెధవన్నర వెధవ! నన్ను మోసం చేయలేవు. ఒక ఆదివారం నీ వెంట వస్తే, ఓ రచన తవ్వి ఆయనింట్లో ఈ కథ చెప్పావు. నేనా సంగతి మర్చిపోలేదు. అప్పుడే చెప్పావు ఇది స్పేనిష్ కథని"

అంబాజీరావు పకపక నవ్వాడు వెంటనే.

"దేనికీ ఇంకా సిగ్గులేక? ఇలా కాపీకొడితే నేనూ రచయితనవగలను తెలుసా?"

"నీకో సంగతి తెలియదయితే" అన్నాడు నవ్వాపుకుంటూ

"తెలుసు! నీలా అంతా కాపీ రచయితలు కాదు"

"అక్కడే పొరబడ్డావ్"

"అయితే తెలుగులో రచయితలం...."

"అలాగే, ఇక్కడో చిన్న కిటుకుంది! నేను వ్రాసిన కథనిఎప్పుడూ నా రచనగా చెప్పను ఏ రచయితకీ. ముఖ్యంగా మనం వెళ్ళిన రచయితకు "సోవియట్ లేండ్"లో నేను చదివిన కథగానో, జర్మన్ కథల అనువాద సంకలనంలో చదివాననో చెప్తాను నా కథని"

"అంటే అబద్ధంగానా?"

"మరో రచయిత కథగా చెపితే ఆ కథలో బాగోగులు, ఎలా వ్రాసివుంటే ఇంకా మంచి కథయేది, ఆ కథలోని మంచి అంశాలేమిటి వగయిరాలు నిర్మొహమాటంగా చెపుతాడాయన. అదే నేను వ్రాసిన కథ అని చెపితే, మొహమాటం అడ్డుపడి "మంచికథ" అనేస్తాడు, విమర్శించడానికి భయపడతాడు యింతకంటే మరేంలేదు. ఆ సంగతి ఆయనకు బాగా తెలుసు!"

ఆశ్చర్యపడ్డాను నేను.

"నిజానికి ఈ ఏర్పాటు ఆయనే చేశారు. నాలాంటి చిన్నరచయితలకు ఆయన తరచూ సలహాలు ఇస్తూంటాడు. ఆయన ఎంతసహృదయుడో అంత మొహమాటస్తుడు మరి."

"ఫన్నీ! ఇట్ లుక్స్ ఫన్నీ ఇండీడ్" అన్నాను నేను.